

శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు

వార్త


## సోమశిల నీటిమట్టం



**అనంతసాగరం, ఆగస్టు 19, ప్రభాత వార్త** మండలంలోని సోమశిల జలాశయానికి ఎగువ ప్రాంతాల నుంచి మంగళవారం సాయంత్రానికి 28161 క్యూసెక్కుల వంతునవరద ప్రవాహం నమోదైంది. జలాశయం పూర్తిసామర్థ్యం 78 టిఎంసిలు కాగా ప్రస్తుతం జలాశయం లో50.550టిఎంసిల నీరు నిల్వ ఉంది. ఎస్ఎఫ్‌సికి 50,ఎన్ఎఫ్‌సికి 340, పెన్నా డెల్టాకు1000, కండలేరు వరద కాలువకు 0 క్యూసెక్కులు వంతున నీటిని విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం 96.408మీటర్ల మేర నీటిమట్టం నమోదైందని జలాశయం అధికారులు తెలిపారు.

# జనసేన నాయకులు చదలవాడ హరీష్ దంపతుల్ని సన్మానించిన సిఎం



**సంగం ఆగష్టు 19 ప్రభాతవార్త** ఆత్మకూరు నియోజకర్గంలోని ఓ బంగారు కుటుంబానికి తమ సహాయ సహాకారాం అందించి ఉత్తమ మార్గదర్శకులుగా ఎంపికైన ఆత్మకూరు నియోజకర్గం జనసేన నాయకులు సంగం మండలం దువ్వూరుకి చెందిన చదలవాడ హరీష్‌కుమార్, మృదుల దంపతులన్ని ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు శాలువా కప్పి సన్మానించారు. పేదవారిని ఆదుకోవడం గొప్ప మనసు ఉన్న వారికే సాధ్యం అవుతుందని పి 4 పథకం ద్వారా మార్గదర్శకులుగా ఉండి ఓ బంగారు కుటుంబాన్ని ఆదుకోని మీ మంచి మనసును చాటుకున్న మీకు మా ప్రభుత్వం అండగా ఉంటుందని సిఎం అభినందనలు తెలిపారు. మిమ్మల్ని గౌరవించడం మా భాద్యత అని సిఎం చంద్రబాబునాయుడు అన్నారు. సీఎం అభినందించడం ఎంతో ఆనందంగా వుందని హరీష దంపతులు సంతోషం వ్యక్తం చేశారు.

# అన్నదాత సుఖీభవతో రైతుల్లో రెట్టింపు సంతోషం

900 ట్రాక్టర్ల తో విజయోత్సవ ర్యాలీ — రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం — ఎమ్మెల్యే సోమి రెడ్డి చంద్రమోహన్ రెడ్డి





**వెంకటాచలం, ఆగష్టు 19, ప్రభాతవార్త :** అన్నదాత సుఖీభవ విజయోత్సవ ర్యాలీ లో రైతులు రెట్టింపు సంతోషం వ్యక్తం చేసారని రైతు ప్రయోజనాలు ప్రధాన ధ్యేయంగా ప్రభుత్వం దృష్టి సారిస్తోంది అని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమి రెడ్డి చంద్ర మోహన్ రెడ్డి పేర్కొన్నారు.వెంకటాచలం లో నిర్వహించిన అన్నదాత సుఖీభవ పీఎం కిసాన్ విజయోత్సవ ర్యాలీలో సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి పాల్గొన్నారు. గోలగముడి రోడ్డు వద్ద నుంచి ఎమ్మెల్యే స్వయంగా ట్రాక్టర్ నడుపుతూ ప్రజలకు అభివాదం చేస్తూ టోల్ ప్లాజా దాక ర్యాలీ నిర్వహించనున్నారు.అనంతరం సోమిరెడ్డి మట్లాదుతూ రాష్ట్రం లోని ఎక్కడ లేని విధంగా అన్న దాత సుఖీభవ విజయోత్సవ ర్యాలీ నిర్వహించటం మరింత రెట్టింపు ఉత్సాహాన్ని ఇచ్చిందన్నారు.సూపర్ సిక్స్.సూపర్ సక్సెస్ మా విజయోత్సవ ర్యాలీ డబుల్ సక్సెస్ అయ్యింద న్నారు. తల్లికి వందనంతో ఇంటింటా ఆనందం మహిళల్లో ఊహించని స్థాయిలో సంతోషాన్ని నింపుతున్న స్త్రీశక్తి.ఈ పథకాలన్నీ చూశాకే పులివెందుల, ఒంటిమిట్ట ఎన్నికల్లో వైసీపీకి గుణపాఠం ప్రజలకు కూటమి ప్రభుత్వం చేస్తున్న మంచిని చూపకపోగా వాస్తవాలను వక్రీకరించే పనిలో బ్లూ మీడియా అన్నదాత సుఖీభవ విజయోత్సవ ర్యాలీని 900 ట్రాక్టర్లతో రికార్డు స్థాయిలో సక్సెస్ చేసిన సర్వేపల్లి నియోజకవర్గ రైతులకు ప్రత్యేక ధన్యవాదములు.అన్నదాతల్లో ఆనందం నింపే ఈ పథకం కోసం రాష్ట్రంలో రూ.9300 కోట్లను కూటమి ప్రభుత్వం ఖర్చు చేస్తోంది.టీడీపీ కూటమి ప్రభుత్వం వచ్చాక వ్యవసాయ శాఖకు పూర్వవైభవం వస్తోంది. నామ రూపాలు కోల్పోయిన వ్యవసాయ శాఖ తిరిగి కొత్తకళను సంతరించుకుంది.తల్లికి వందనం పథకం తోనూ ప్రతి ఇంటా ఆనందమే.గత ప్రభు త్వం ఇంటికి ఒక్క బిడ్డకే అమ్మఒడి ఇస్తే, మా కూట మి ప్రభుత్వం తల్లికి వందనం ఇంట్లో ఎంత మంది పిల్లలున్నా అందరికీ లబ్ధి చేకూరుస్తోంది. రైతుల వరి పొలాలకు స్ప్రే చేసే డ్రోన్‌ను అందజేశారు. సర్వేపల్లి నియోజకవర్గ సమన్వయకర్త సోమి రెడ్డి రాజా గోపాల్ రెడ్డి.నియోజక వర్గం లోని 5 మండలాల అధ్యక్షులు నాయకులూ,కార్యకర్తలు పాల్గొన్నారు.

### సోమిరెడ్డి సమక్షం లో ఏ పీ సి ఏ ఎస్ ఛైర్మెన్ ప్రమాణ స్వీకారం

మండల పరిధి లోని చవటపాలెం ఏ పీ సి ఏ ఎస్ ఛైర్మెన్ గా రావూరు రాధా కృష్ణ నాయుడుని నియమించడం తో వేలాది మంది రైతుల సమక్షం లో చవటపాలెం ఏపీసిఏఎస్ కార్యాలయాన్ని చేరుకొని ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్ర మోహన్‌రెడ్డి సమక్షం లో రాధా కృష్ణ నాయుడు ప్రమాణ స్వీకారం చేసారు. అయన తో పాటు డైరెక్టర్లగా నాగరాజు,యనమల కిష్టయ్య ప్రమాణ స్వీకారం చేసారు.రైతులకు అందుబాటులో ఉండి రైతు సమస్యలు నిరంతరం పరిష్క రించేందుకు చర్యలు చేపట్టాలని తెలిపారు.

# పొట్టేపాళెం అభివృద్ధి దిశగా మరో అడుగు

- కోటీ 40 లక్షల నిధులతో అభివృద్ధి పనుల శంకుస్థాపన



**నెల్లూరు రూరల్, ఆగస్టు 19, ప్రభాతవార్త :** రూరల్ నియోజకవర్గ పరిధిలోని పొట్టేపాళెం గ్రామ అభివృద్ధి పనులకు కోటి 40 లక్షల రూపాయల నిధులు కేటాయించారు. ఈ పనులకు నేడు శంకుస్థాపన చేసిన రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్, టీడీపీ నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఒకటికి మూడు సార్లు పొట్టేపాళెం గ్రామం నాకు అండగా నిలిచిందన్నారు. ఈ గ్రామానికి ఇంకా చేయాల్సిన పనులు చాలా ఉన్నాయి. నిధుల లభ్యత మేరకు అభివృద్ధి పనులకు ప్రాధాన్యత ఇస్తాం" అని ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి తెలిపారు. పనిచేసే కలెక్టర్ నెల్లూరులో ఉండటం మా అదృష్టం. నిధులు ఎలా తీసుకురావాలో, ఎక్కడ లభిస్తాయో సూచనలు ఇస్తూ సహకరిస్తున్నందుకు కలెక్టర్ ఓ. ఆనంద్‌కి నా కృతజ్ఞతలు అని ఆయన అభిప్రాయపడ్డారు. జిల్లా కలెక్టర్ ఆనంద్ మాట్లాడుతూ, పొట్టేపాళెం అభివృద్ధి కోసం ఎమ్మెల్యే చొరవతో నిధుల సమీకరణ జరుగుతోంది. గ్రామ అభివృద్ధికి ఎల్లప్పుడూ సహకారం అందిస్తాం అన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు ఇందుపూరు శ్రీనివాసులు రెడ్డి, మండల ప్రజాపరిషత్ అధ్యక్షులు బూడిద విజయ్ కుమార్, ఇందుపూరు అచ్యుత్ రెడ్డి, టీడీపీ రూరల్ మండల కన్వీనర్ పముజుల ప్రదీప్,సర్పంచ్ ఏడుకొండలు,ఎంపీటీసీ నేరెళ్ల నారాయణ, జడ్పీ కో ఆప్షన్ మెంబర్ అల్లాబక్షు,పొన్నాల రామచంద్రా రెడ్డి,ఏటూరి శ్రీనివాసులు రెడ్డి, చెన్నారెడ్డి సురేష్ రెడ్డి, చెన్నారెడ్డి అశోక్ రెడ్డి, సతీష్ రెడ్డి, కందల హరి, జనార్దన్ రెడ్డి, దువ్వూరు జనని బాబు, బాలకృష్ణ, పెంచలయ్య, సురేష్, ముత్యాల సుబ్రహ్మణ్యం, నవాజ్, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే పై హత్యాయత్నానికి మాజీ ఎమ్మెల్యేను అరెస్ట్





**కావలి,19 ఆగస్టు ప్రభాత వార్త :** కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి పై హత్యాయత్నానికి ప్రయత్నించిన మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డిని వెంటనే అరెస్ట్ చేయాలని టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు డిమాండ్ చేశారు. కావలి పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం ఎదుట మంగళవారం బైఠాయించి నిరసన తెలిపారు. టిడిపి నేతల నిరసన కార్యక్రమంతో గంటపాటు ట్రాఫిక్ నిలిచిపోయింది. అనంతరం అంబేద్కర్ విగ్రహం నుండి ఎన్టీఆర్ విగ్రహం వరకు నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ నాయకులు మాట్లాడుతూ ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డి అన్నవరం క్వారీ వద్దకు వస్తున్నారన్న సమాచారం అందుకొని రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి ముఖ్య అనుచరులు హత్యాయత్నానికి రెక్కీ నిర్వహించారని తెలిపారు. మారణాయుధాలతో దాడి చేయాలని, డ్రోన్ల సహాయంతో ఎమ్మెల్యే ని కనిపెట్టాలని కుట్ర పన్నడం జరిగిందని తెలిపారు. ఎమ్మెల్యే కార్యక్రమం మారిపోవడం, క్వారీకి వెళ్లక పోయేసరికి ప్రమాదం తప్పిందని, అక్కడ ఉన్న సిబ్బందిపై దాడికి దిగడం జరిగిందని తెలిపారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మాజీ ఎమ్మెల్యే అనుచర్ల చేతిలోని మారణాయుధాలను, వారి అనుచరులు కొంతమందిని అదుపులో తీసుకోవటం జరిగిందని తెలిపారు. నిందితులు కొంతమంది మాత్రమే దొరకటం జరిగిందని, మరి కొంతమంది పారిపోవటం జరిగిందని తెలిపారు. ఈ ఘటన వెనుక ఉన్న మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి ని, అలాగే ఈ ఘటతో ప్రమేయం ఉన్న వారి అనుచరుల మొత్తాన్ని అరెస్ట్ చేయాలన్నారు. ప్రశాంతమైన కావలిని హత్యా రాజకీయాలకు నిలయం చేస్తారా అంటూ రెక్కీ ఘటనపై టీడీపీ నేతలు భగ్గుమన్నారు. మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి హింసాత్మక, విధ్వంసక ఆలోచనలు ప్రజాస్వామ్య మనుగడకు ప్రమాదకరమంటు ఆయన ను వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కావలి పట్టణ టిడిపి అధ్యక్షులు గుత్తికొండ కిషోర్ బాబు, ప్రధాన కార్యదర్శి జ్యోతి బాబురావు, రాష్ట్ర కార్యదర్శి మలిశెట్టి వెంకటేశ్వర్లు, మాజీ మున్సిపల్ చైర్పర్సన్ పోతుగంటి అలేఖ్య, టిడిపి నాయకులు కండ్లగుంట మధుబాబు నాయుడు, అమర వేదగిరి సుబ్బరాయుడు గుప్తా, తిరువీధి ప్రసాద్, కావలి రూరల్ మండల అధ్యక్షులు ఆవుల రామకృష్ణ, మహాజన సైన్యం సురేంద్ర, పెద్ద ఎత్తున తెలుగుదేశం, బీజేపీ, జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

# జీజీహెచ్‌లో, ట్రైనీ వైద్యులకు మేల్ నర్సులకు మధ్య గొడవలు తారాస్థాయికి

- మేల్ నర్సు వెంకటయ్య పై ట్రైనీ డాక్టర్లు విచక్షణారహితంగా దాడి
- వైద్యులు, సిబ్బంది పట్ల సరైన పర్యవేక్షణ లేకపోవడమే కారణం
- మేల్ నర్స్ వెంకటయ్య ప్రైవేటు పార్ట్స్‌పై దాడికి పాల్పడ్డ పీజీలు
- అడ్డొచ్చిన మరో మేల్ నర్సుపైన దాడి
- ఘర్షణ వాతావరణం, ఉద్రిక్తతల మధ్య అట్టుడుకుతున్న జీజీహెచ్






**నెల్లూరు,ఆగస్టు 19, ప్రభాతవార్త** నెల్లూరు ప్రభుత్వ సర్వజన వైద్యశాల డాక్టర్లు, సిబ్బంది సమన్వయ లోపంతో వైద్య సేవలకు అడుగడుగునా ఆటంకం ఏర్పడుతోంది. అటు ఏసీఎస్ఆర్ వైద్యశాల, ఇటు సర్వజన వైద్యశాలలో వైద్యుల పట్ల వారు అనుసరిస్తున్న విధానాల పట్ల పర్యవేక్షణ లేకపోవడంతో ఘర్షణ వాతావరణం తలెత్తుతోంది. హౌస్ సర్జన్‌లు, పీజీలు హాస్పిటల్లో ఇష్టానుసారం వ్యవహరిస్తున్నారు. నర్సింగ్ స్బిందిని, కాంట్రాక్టు సిబ్బందిని వీరు తక్కువ భావంతో చూస్తూ ఉండడంతో ప్రశాంతంగా ఉండాల్సిన వైద్యశాల ఉద్రిక్తలకు కేరాఫ్ అడ్రస్‌గా మారుతోంది. ఈ కోవలో మేల్ నర్స్ వెంకటయ్యకు ట్రైనీ వైద్యులు, దినేష్‌కు మధ్య ఈనెల 16వ తేదీ క్యాజువాలిటీలో ఘర్షణ వాతావరణం తలెత్తింది. ఇది చిలికి చిలికి గాలి వానలా మారి మేల్ నర్సు వెంకటయ్యపై ట్రైనీ వైద్యులు దాడి చేసే స్థితికి చేరుకుంది. పీజీలు, హౌస్ సర్జన్ల దాడిలో గాయపడి, జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న వెంకటయ్యను ప్రభాతవార్త పలకరించగా, తాను పలు విషయాలను వెల్లడించాడు. క్యాజువాలిటీకి సంబంధించి పేషెంట్లుకోసం 9 బెడ్లు ఉండడం, రోగులు ఎక్కువ మంది వైద్యానికి చేరుకోవడం, బెడ్లను ఖాళీ చేయిస్తే, మరింత మంది రోగులకు వైద్య సేవలు అందించవచ్చున్న తన సూచనతో పీజీ వైద్యులు దినేష్ కోపోద్రిక్తుడయ్యాడని వెంకటయ్య వివరించారు.

# జీజీహెచ్ ఎదుట నర్సింగ్ సిబ్బంది ధర్నా

- మేల్ నర్స్ వెంకటయ్య, మరో మేల్ నర్స్ కళ్యాణ్ కుమార్ దాడి ఘటనపై భగ్గుమన్న నర్సింగ్ సిబ్బంది
- ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో తమకు రక్షణ లేదంటున్న నర్సింగ్ సిబ్బంది
- న్యాయం చేయాలంటూ పోరుబాట




**నెల్లూరు, ఆగష్టు 19, ప్రభాతవార్త-వైద్యం** నెల్లూరు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో మేల్ నర్సు వెంకటయ్య మరో మేల్‌నర్స్ కళ్యాణ్ కుమార్‌పై పీజీలు, హౌస్ సర్జన్ల దాడి ఘటనపై జీజీహెచ్‌లోని నర్సింగ్ సిబ్బంది ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇద్దరు మేల్ నర్సులపై దాడికి పాల్పడ్డ ట్రైనీ వైద్యులను శిక్షించాలంటూ జీజీహెచ్ ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా నర్సింగ్ సిబ్బంది, హెడ్ నర్సులు మాధురి, శాంతి, వరలక్ష్మి తదితరులు మాట్లాడుతూ పీజీలు, హౌస్ సర్జన్లు మేల్ నర్సు వెంకటయ్యను, మరో మేల్ నర్స్ కళ్యాణ్ కుమార్‌ను విచోణ రహితంగా కొట్టడం దారుణమని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి ఘటనలతో ఆసుపత్రిలో ప్రశాంత వాతావరణం ఉద్రిక్త పరిస్థితులకు దారి తీస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటువంటి దాడులు జరుగుతున్నా దీనిపై పర్యవేక్షణ లేదని, ఈ ఘటనలతో తమకు అభద్రతా భావం ఏర్పడుతుందని వెల్లడించారు. జరిగిన దాడి ఘటనపై ఫోర్త్ టౌన్ పోలీసు స్టేషన్లో కంప్లైంట్ చేశామని, అయితే సోమవారం సాయంత్రం జరిఇన దాడి పై ఫిర్యాదు చేస్తే ఇంత వరకు చర్యలు చేపట్టలేదని తెలిపారు. ఇదేమని సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ మాధవి ని వివరణ కోరగా కేసు పెడితే జైలుకెళ్తారు. ఏమవుతుంది అని వివరణ ఇచ్చారని, ఆమె బాధితుల పట్ల ఎంత నిర్లక్ష్యంగా వ్యవహారిస్తున్నారో ఈ విషయం తేట తెల్లం చేస్తుందన్నారు. తమకు న్యాయం జరిగే వరకు పోరాడుతామని ప్రకటించారు. వెంకటయ్యపై దుస్తులు చిరిగిపోయే విధంగా విచక్షణారహితంగా దాడి చేయడమే కాకుండా, ప్రైవేటు పార్ట్స్ పైనా దాడి చేయడం హేయమైన చర్య అని వాపోయారు. మద్యం సేవించి విధులకు హాజరయ్యే ఈ ట్రైనీ వైద్యులు శిక్షణ పూర్తి చేసుకుని వెళ్లాక ఎలాంటి వైద్యం అందిస్తారో తెలుసుకోవచ్చున్నారు. తాగి వైద్యం అందించే ఇలాంటి డాక్టర్లు సమాజానికి ఏం మేసేజ్ ఇస్తున్నారని ప్రశ్నించారు. మద్యం సేవించి విధులకు హాజరయ్యే శిక్షణా వైద్యులపై తక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. తాము పెట్టిన కేసులో ట్రైనీ వైద్యులు దినేష్ సందీప్, శ్రీతేజ, రాజేశ్వర్, భార్గవ్, అనిల్, హరీష్ తదితరులు ఉన్నారని, వీరందరిపై ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో హెడ్ నర్సులు వసుంధర, సుమతి, ప్రభుత్వ, ప్రైవేటు నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

# మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి విడుదల వాయిదా



**నెల్లూరు క్రైమ్, ఆగష్టు 19, ప్రభాతవార్త :** పలు కేసుల్లో నెల్లూరు కేంద్ర కారాగారంలో రిమాండ్ ఖైదీగా ఉన్న మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డికి హైకోర్ట్ సోమవారం బెయిల్ మంజూరు చేసిన విషయం విదితమే. మంగళవారం కారాగారం నుండి ఆయన విడుదల కావాల్సి ఉండగా బెయిల్ పత్రాలు అందజేయడం ఆలస్యం కావడంతో అయన విడుదల వాయిదా పడింది. బెయిల్ పత్రాలు ఆలస్యంగా జిల్లా జైలు వద్దకు తీసుకురావడంతో, అప్పటికే సమయం పూర్తి కావడంతో జైలు అధికారులు కాకాణిని విడుదల చేయలేదు. బుధవారం ఉదయం ఆయన జైలు నుంచి విడుదల కానున్నారు. కాకాణి విడుదల అవుతారని తెలియడంతో జిల్లా వైసీపీ నేతలు, ఆయన అనుచరులు పెద్ద సంఖ్యలో జైలు వద్దకు చేరుకున్నారు. అయన విడుదల వాయిదా పడడంతో అందరూ వెనుతిరిగారు.

# సచివాలయాలును ఆకస్మిక తనిఖీలు చేసిన ఎమ్మెల్యే





**ఉలవపాడు, ఆగష్టు 19, ప్రభాతవార్త** ప్రభుత్వ కార్యాలయాల్లో ఉద్యోగుల పనితీరును, సమయపాలనను పరిశీలించేందుకు కందుకూరు శాసనభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు మంగళవారం ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఉలవపాడు మండలంలోని కరేడు, అలగాయపాలెం గ్రామ సచివాలయాలను ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ప్రజా సేవలో నిర్లక్ష్యం, అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని, ఈ సందర్భంగా ఆయన ఉద్యోగులను హెచ్చరించారు. సచివాలయంలో అటెండెన్స్, మూవ్‌మెంటన రిజిస్టర్లను పరిశీలించారు. విధులకు ఎంత మంది హాజరయ్యారు. అనుమతి లేకుండా బయటకు వెళ్లిన సిబ్బంది ఎవరు అనే వివరాలను క్షుణ్ణంగా ఆరా తీశారు. విధుల్లో లేని సిబ్బంది ఎక్కడికి వెళ్లారనే దానిపై అక్కడికక్కడే ఉన్నతాధికారులతో ఫోన్‌లో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం అక్కడికి వచ్చిన స్థానిక ప్రజలతో మాట్లాడి సచివాలయంలో అందుతున్న సేవల గురించి, సిబ్బంది పనితీరు గురించి తెలుసుకున్నారు. అనంతరం ఉలవపాడు తహశీల్దార్ కార్యాలయానికి వెళ్లారు. తహశీల్దార్ కార్యాలయంలో రికార్డులను పరిశీలించి వివిధ సమస్యలపై వచ్చిన ప్రజలతో నేరుగా మాట్లాడారు. వీలైనంత త్వరగా ప్రజల సమస్యలను పరిష్కరించాలని అధికారులకు సూచించారు.

## దివ్యాంగుల పెన్షన్లు తొలగింపులో కఠిన వైఖరికి స్వస్తి చెప్పండి

- బీజేపీ నేత మిడతల రమేష్ విజ్ఞప్తి



**నెల్లూరు అగ్రికల్చర్, ఆగష్టు 19, ప్రభాతవార్త :** దివ్యాంగుల సర్టిఫికేట్ల వెర్ఫికేషన్‌లలో వారు నష్టపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని దివ్యాంగుల సంక్షేమ శాఖ అసిస్టెంట్ డైరక్టర్ ఆయు బ్ ఖాన్‌కు బీజేపీ నేత మిడతల రమేష్ విజ్ఞప్తి చేశారు. సదరన్ సర్టిఫికేట్లు వెర్ఫి కేషన్‌లో ఎక్కువ మంది డాక్టర్లు పర్స ంటేజి తగ్గిస్తున్నట్లు ఆరోపణలు వస్తు న్నాయి. కనుక దివ్యాంగుల పట్ల కఠిన వైఖరి అనుసరించకుండా వెర్ఫికేషన్‌లు చేయాలని రమేష్ విజ్ఞప్తి చేశారు. గత ఐదు సంవత్సరాల ముందు 60 శాతం శాశ్వాత సర్టిఫికేట్ పొందిన దివ్యాంగులకు ప్రభుత్వం ఇచ్చే స్కూటీ ఎలక్ట్రిక్ వాహనాల సదుపాయం లేదు. 80శాతం సదరం సర్టిఫికేట్ పొందిన వారికి ఈ వాహనాల సదుపాయం ఉంది. వాస్తవానికి గతంలో శాశ్వత సర్టిఫికేట్ పొందిన వారు వయసు పైబడిన కొద్ది శరీరంలో సహజంగా శక్తిని కోల్పోతారు. రెండు కర్రల సపోర్టుతో నడిచే వ్యక్తికి పర్స ంటేజి ఎంత ఉన్నా, సామాన్యునితో సమానం కాదు. ఇటువంటి దివ్యాంగులకు కూడా ఎలక్ట్రిక్ స్కూటీలు అందించాలి. పెన్షన్ సదుపాయం పొందాలంటే బీపీఎల్ మార్గదర్శకాలలోనూ ఉదాసీనంగా వ్యవహరించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నామని రమేష్ తెలిపారు. సదరం పత్రాల పున:పరిశీలన సమయంలో ఇన్‌కమ్‌టాక్స్ ఇలాంటివి ప్రామాణికంగా చూపి పెన్షన్లు తొలగించవద్దని అసిస్టెంట్ డైరక్టర్‌కు రమేష్ విజ్ఞప్తి చేశారు.

## ఇలా ఉంటే నీళ్లు ఎలా వస్తాయి



**ఉదయగిరి, ఆగష్టు 19, ప్రభాతవార్త :** ఉదయగిరి మండల పరిధిలోని గండిపాలెం జలాశయం కుడి ఎడమ ప్రధాన కాలువలు అధ్వాన్నంగా మారాయి. కూత వేటు దూరంలో జలాశయం ఉన్నప్పటికి ఉదయగిరి వరికుంటపాడు మండలాల రైతులకు నీరు అందడం లేదు. 16 వేల ఎకరాల సాగు విస్తీర్ణం కాగా పూర్తి స్థాయిలో ఆయకట్టుకు నీరు చేరడం లేదు. కాలువలు పూడి పోయి కంప చెట్లు పెరగడంతో పూర్తి స్థాయిలో పొలాలకు నీరు అందే పరిస్థితి లేదని సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని రైతులు ప్రజలు కోరుతున్నారు. అలాగే పిల్ల కాలువలు పూర్తి స్థాయిలో బాగు చేయాలని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## ఈ పంట నమోదు కార్యక్రమాన్ని వేగవంతంగా చేయాలి




**వింజమూరు, ఆగష్టు 19, ప్రభాతవార్త :** ప్రస్తుతం వ్యవసాయ శాఖ అమలుపరుస్తున్న ఈ పంట నమోదు కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని జిల్లా వ్యవసాయాధికారిణి సత్యవాణి తెలిపారు. మంగళవారం వింజమూరులోని రైతు సేవా కేంద్రంలో సబ్ డివిజన్ పరిధిలోని వ్యవసాయ సహాయకుల శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగ ఆమె మాట్లాడుతూ సబ్ డివిజన్ పరిధిలోని దుత్తలూరు వినంజమూరు సబ్ డివిజన్ పరిధిలోని వ్యవసాయ సహాయకులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించామని తెలిపారు. ఈ శిక్షణా కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ గ్రామ స్థాయిలో రైతు సేవా కేంద్రాలలో ఉంటూ రైతులకు ఎప్పటికప్పుడు పంటల సాగులో సూచనలు సలహాలు ఇవ్వాలన్నారు. అన్నదాత సుఖీభవపై ఫిర్యాదులు వస్తే వెంటనే పై అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని తెలిపారు. ప్రస్తుతం జరుగుతున్న ఈ పంట నమోదు కార్యక్రమం గతంలో పంట వేసిన భూముల్లోనే నమోదు చేసే వారమని, కానీ ప్రస్తుతం కొత్తగా వచ్చిన ప్రపోజల్ ద్వారా పంట వేయని భూములను కూడా ఈ పంట నమోదు చేయాలన్నారు. కలిసి 2000 ల్యాండ్ మార్క్స్ ఉన్నాయని వాటిలో రోజుకు 200 ల్యాండ్ మార్క్స్ చేయాల్సి ఉందన్నారు. అన్నదాత సుఖీభవ పథకం కింద 4190 మంది రైతులకు నగదు అని మిగిలిన వారికి ఖాతాలు లేనందువల్ల జమ కాలేదన్నారు. వారికి కూడా జమ అయ్యే విధంగా చేయాలన్నారు. రైతులకు అవసరమైన రాయితీపై జింక్ సల్ఫేట్ తది తరాలు అందించేందుకు కృషి చేయాలన్నారు. పొలం బడి పొలం పిలుస్తోంది కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. జిల్లా వ్యవసాయ కార్యాలయం నర్సోసి మాట్లాడుతూ వివిధ పంటలలో కలుపు నివారణ పద్దతులు యాజమాన్య పద్దతులను గురించి తెగుళ్ల నివారణ గురించి వివరించారు. కృషి విజ్ఞాన కేంద్ర శాస్త్రవేత్త కిరణ్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామ సహాయకులు రైతులు సాగు చేస్తున్న పంటలను పరిశీలించి తెగుళ్లను గుర్తించి నివారణకై తగు సూచనలను సలహాలను అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ శేషగిరిరావు, ఏవో వాసు, జహీర్, శ్రీవాణి, శ్రీహరి, నారాయణ, వ్యవసాయ సహాయకులు తదితరులు ఉన్నారు.

## బోగోలులో కూటమి నేతల నిరసన



**బిట్రగుంట ఆగష్టు 19 ప్రభాతవార్త:** కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణారెడ్డి పైన మాజీ ఎమ్మెల్యే ప్రతాప్ రెడ్డి అనుచరులు మంగళవారం హత్యాయత్నం చేయడానికి రెక్కీ నిర్వహించటం పైన ఖండిస్తూ బోగోలు అంబేద్కర్ విగ్రహం ఎదుట కూటమి నేతలు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎమ్మెల్యేను అంతమోందించేందుకు మారణాయుధాలతో రెక్కీ చేస్తూ పట్టుబడిన ఈ ఘటన ప్రతి ప్రజాసా వ్యమ్యవాది ని దిగ్భ్రాంతికి గురి చేస్తుందని పేర్కొన్నారు. ఈ అమానవీయ ప్రయత్నాన్ని తీవ్రంగా ఖండిస్తు న్నామన్నారు ఈ కార్యక్రమం లో మండల టీడీపీ అధ్యక్ష కార్యదర్శులు ఎం. నాగేశ్వరావు, ఎల్. సుదీర్ బాబు, నాగులవరం సొసైటీ అధ్యక్షులు చిలకపాటి వెంకటేశ్వర్లు, బీజేపీ సీనియర్ నేత నూకసాని శ్రీనివాసులు, జనసేన నేతలు పాల్గొన్నారు.

## భీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి




**మనుబోలు ఆగష్టు 19 ప్రభాతవార్త :** స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా ద్వారా అమలు చేసే భీమా పథకాలను అందరు వినియోగించుకోవాలని స్టేట్ బ్యాంకు రీజనల్ మేనేజర్ సత్యనారాయణస్వామి కోరారు. మనుబోలు మండలంలోని మడమనూరు గ్రామంలో జన సురక్ష యోజనపై గ్రామస్థులకు ఆయన అవగాహన కల్పించారు. మహిళలు తప్పనిసరిగా పొదుపున అలవాటు చేసుకోవాలన్నారు. ప్రతి ఒక్కరు జన్‌ధన్ ఖాతాలను కలిగి ఉండాలన్నారు. నెలకి ఎంతో కొంత పొదుపు చేయాలని ఆయన సూచించారు. తమ శాఖ ద్వారా తక్కువ ప్రీమియంతో ఎక్కువ భీమా సౌకర్యం కల్పిస్తామన్నారు. 20 రూపాయాలతో ప్రధానమంత్రి సురక్ష యోజన 36 రూపాయాలతో ప్రధానమంత్రి జీవన్ జ్యోతి యోజన ద్వారా ఏదైనా అనారోగ్యం జరిగినప్పుడు వెంటనే రెండు లక్షలు అందజేస్తామన్నారు. అనంతరం స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా బ్రాంచ్ మేనేజర్ సంతోష్‌కుమార్ మాట్లాడుతు గ్రామాలలో భీమా సౌకర్యంపై అవగాహన కల్పించుటకే ఈ సమావేశాన్ని నిర్వహించామన్నారు. ఇందులో ప్రధానమంత్రి ముద్రఖాతాలు అటల్ ఫించన్ యోజన ప్రధానమంత్రి సురక్ష యోజన, ప్రధానమంత్రి జీవన్ జ్యోతి యోజన, పథకాల గురించి పూర్తి స్దాయిలో అవగాహన కల్పించామన్నారు. ప్రమాదం జరిగితే భీమీ చెల్లిస్తామన్నారు. ఎన్నో లాభాలు ఉంటా యని వివరించారు. ఈకార్యక్రమంలో ఆర్‌బి ఓ గూడూరు శాఖ చీఫ్ మేనేజర్ శర్మ, పీల్డ్ ఆఫీసర్ రమేష్ స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా మనుబోలు ఫీల్డ్ ఆపీసర్ లక్ష్మణ్ కుమార్, అసోసియేట్ బివి రత్నం, బిజినెస్ కరస్పాండెంట్ రాజేశ్వరీ, ఏపిఎం వనజాక్షి, ప్రధానోపాధ్యాయులు రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా పల్లకి సేవ



**కోవూరు , ఆగష్టు 19 ప్రభాతవార్త :** కోవూరులో వెలసి ఉన్న శ్రీ వీరాంజనేయ స్వామి దేవస్థానంలో శ్రావణమాస ఏకాదశి పర్వదినం సందర్భంగా ప్రాతకాలమునే స్వామివారికి ఆలయ ప్రధాన అర్చకులు నాగరాజాచార్యులు ఆధ్వర్యంలో అభిషేక పూజలను సాంప్రదాయ బద్దంగా భక్తిశ్రద్ధలతో నిర్వహి ంచారు. ఈ సందర్భంగా నాగవల్లి పత్రాలతో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పల్లకి సేవ కార్యక్రమాలను కన్నులపండువగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రుత్వికులు సుబ్బయ్య స్వామి, నందకిషోర్ స్వామి, భక్తులు ఉన్నారు.

## అల్లూరులో టిడిపి శ్రేణులు ఆగ్రహం



**అల్లూరు, ఆగస్టు 19, ప్రభాతవార్త:** ప్రతాప్ కుమార్ రెడ్డి అనుచరులు హత్యాయత్నం చేసేందుకు మారణాయుధాలతో రెక్కీ నిర్వహిస్తూ దొరికి పోయారని అల్లూరులో మంగళవారం సాయంత్రం అంబేద్కర్ విగ్రహం వద్ద టిడిపి బిజెపి జనసేన నాయకులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఖపడ్ దార్ ప్రతాప్ రెడ్డి అంటూ కూటమి ప్రభుత్వ నాయకులు హెచ్చరించారు. కావలిని కాపు కాస్తూ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తున్న మా ఎమ్మెల్యే చూసి భయపడి హత్యాయత్నం చేయాలని వైసిపి మాజీ ఎమ్మెల్యే ప్రతాపరెడ్డి అనుచరులు ప్రయత్నించడం దారుణమని టిడిపి. బిజెపి. జనసేన నాయకులు గ్రామంలో నల్ల బ్యాడ్జీలు ధరించి ర్యాలీ నిర్వహించారు . కార్యక్రమంలో తెలుగుదేశం నాయకులు. సామంతుల పరంధామ రెడ్డి. మేద కృష్ణారెడ్డి. బండి శ్రీనివాసులు రెడ్డి. రామి శెట్టి కృష్ణ చైతన్య. నీలపరెడ్డి హరీష్ కుమార్ రెడ్డి. బిట్రగుంట వెంకట చైతన్య రెడ్డి. షేక్ ఇస్మాయిల్. నజీర్ భాష. ఆట తిరుమల. కాళహస్తి వెంకటేశ్వర్లు. యారాసు మురళి. అలగర రమణయ్య. బిజెపి నాయకులు కత్తుల కిరణ్ నాయుడు. జనసేన మండలాధ్యక్షుడు కార్తీక్ శర్మ. తదితరులు పాల్గొన్నారు .

## రెడ్ క్రాస్ ను సందర్శించిన మునిసిపల్ కమీషనర్ శ్రావణ్ కుమార్



**కావలి, 19 ఆగస్టు ప్రభాత వార్త:** పట్టణంలోని తలసేమియా బాధిత చిన్నారులను గుర్తించి వారికి చికిత్స అందించాలని కావలి మునిసిపల్ కమీషనర్ జి శ్రావణ్ కుమార్ కోరారు. మంగళవారం అయన రెడ్ క్రాస్ భవనాన్ని సందర్శించి అక్కడి సేవా కార్యక్రమాలను పరిశీలించారు. ఈ సందర్భంగా తలసేమియా డే కేర్ సెంటర్ వైద్యాధికారి డాక్టర్ పామూరు శ్రీధర్ తలసేమియా వ్యాధి గురించి, బాధిత చిన్నారులకు ఉచితంగా అందిస్తున్న సేవల గురించి వివరించారు. రక్తకేంద్రం కన్వీనర్ డాక్టర్ టి రమ్య రక్తకేంద్రంలో ఉన్న యంత్రసామాగ్రి, పరికరాలు, దాతల నుండి సేకరించిన రక్తానికి చేసే పరీక్షలను, రక్తాన్ని రక్తకణాలు, ప్లాస్మా, ప్లేట్ లెట్స్ గా విభజించి అవసరమైన వారికి అందించే విధానాన్ని వివరించారు. ఈ సందర్భంగా కమీషనర్ శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ, పలు మెట్రో నగరాలకు దీటుగా కావలిలో రెడ్ క్రాస్ రక్తకేంద్రం తలసేమియా ఆసుపత్రులను నిర్వహిస్తుందని ప్రశంసించారు. కావలి పట్టణంలోని ప్రతీ వార్డులో రక్తలేమితో ఉన్న చిన్నారులను గుర్తించి, వారికి తలసేమియా పరీక్షలు చేయించాలని అన్నారు. తమ పరిధిలోని ఏ యన్ యం, ఆశా వర్కర్లకు అవగాహన కల్పించి, గుర్తింపు ప్రక్రియను ప్రారంభించాలని కోరారు. అనంతరం అయన తలసేమియా కేంద్రంలో రక్తం ఎక్కించుకుంటున్న చిన్నారులను, వారి తల్లిదండ్రులతో ముచ్చటించి వారికి సంఘీభావం తెలిపారు. రెడ్ క్రాస్ ప్రతినిధులు వారి చేతుల మీదుగా చిన్నారులకు పౌష్టిక ఆహార పదార్థాలు, మందులు అందజేశారు. కమీషనర్ శ్రావణ్ కుమార్ ను, వారితో పాటు రెడ్ క్రాస్ ను సందర్శించిన గొట్టిపాటి కొండపనాయుడు, లెక్కల శ్రీనివాసులు నాయుడులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో కావలి రెడ్ క్రాస్ చైర్మన్ డి రవిప్రకాష్, వైస్ చైర్మన్ కె హరినారప రెడ్డి, మున్సిపల్ ఉద్యోగిని బోరేటి రజని, రెడ్ క్రాస్ సిబ్బంది పాల్గొన్నారు.

## పెరమళ్ళపాడులో పొలం పిలుస్తొంది



**చేజర్ల ఆగష్టు 19 ప్రభాతవార్త :** చేజర్ల మండలంలోని పెరమళ్ళపాడు ,పాతపాడు గ్రామాలలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పంటల్ని సాగు చేస్తున్న రైతులు ,రైతులు వేసిన పంటల్ని నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయ విస్తరణాధికారి సుజాత తెలియజేశారు. అలాగే అన్నదాత సుఖీభవ పథకం కింద రాష్ట్ర ప్రభుత్వం రైతు ఖాతాలో 7 వేలు రూపా యాలు జమ చేసిందని అయితే కొందమంది రైతులకు డబ్బులు జమ కాలేదని తెలియజేయడంతో వారు గ్రామ సచివాలయాలలో అర్జి దాఖలు చేసుకోవాలని ఆగష్టు 20 తేదితో గడువు ముగుస్తుందని అన్నారు. పంటలు సాగు చేసుకున్న రైతులకు పలు సూచనలు సలహాలు అందించారు. నత్రజని తక్కువ మోదాలో వాడుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారులు మాధురి, రైతులు పాల్గో న్నారు.

## పల్లంరెడ్డి ఆధ్వర్యంలో అన్నదాత సుఖీభవ



**ముత్తుకూరు, ఆగస్టు 19, ప్రభాతవార్త :** సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి ఆధ్వర్యంలో పంటపాలెం పంచా యితీ వెంకటాచలంలో నిర్వహిస్తున్న అన్నదాత సుఖీభవ, పిఎం కిసాన్ విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. కృష్ణపట్నం సొసైటీ అధ్యక్షులు పల్లంరెడ్డి, రైతులు విజయోత్సవ ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పల్లం రెడ్డి రామ్మోహన్ రెడ్డి మాట్లాడుతూ పిఎం కిషాన్ పథకంతో కేంద్ర రైతులకు ఆరు వేలు ఇస్తుంటే అన్నదాత సుఖీభవ పథకం ద్వారా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మరో 14 వేలు కలిపి 20 వేలు అందిస్తున్నారని అన్నారు. వైసిపి ప్రభుత్వంలో 7500 కలిపి 13,500 ఇస్తుంటే కూటమి ప్రభుత్వం ఏకంగా 20 వేలు అందజేస్తున్నట్లు కొనియాడారు. అన్నదాత సుఖీభవ పథకంతో రైతులలో రెట్టింపు సంతోషం కనిపిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పల్లం రెడ్డి శ్రీధర్ రెడ్డి, తెలుగు యువత మండల కార్యదర్శి యదనపర్తి శ్యామ్ రెడ్డి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## కృష్ణపట్నంలో డ్రైనేజీ పూడికతీత పనులు



**ముత్తుకూరు, ఆగష్టు 19, ప్రభాతవార్త :** కృష్ణపట్నం పంచాయితీలో డ్రైనేజీ పూడికతీత పనులను మంగళవారం చేపట్టారు. కాలువలో పూడిక తీయకపోవడం వలన కాల్వలో నీళ్ళు నిల్వ ఉండడంతో దోమలు వృద్ధి చెంది ప్రజలు అనారోగ్యం వచ్చే అవకాశం ఉండడంతో స్థానిక టిడిపి సీనియర్ నాయకులు రాగాల శివకృష్ణ, దేవస్థానం చైర్మన్ మామిడాల శ్రీనివాసులు ఆదేశాలతో డ్రైనేజ్‌లో పూడికతీత పనులను చేపట్టినట్లు టిడిపి నాయకులు వాకాటి చెంగయ్య అన్నారు. ఎన్నో ఏళ్ళుగా పూడిక తీత తీయకపోవడంతో ఇబ్బందులు పడ్డామని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి సహకారంతో పంచాయితీలలో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టడం జరిగిందని, ఈ కాలువ పూడికతీత పనులను చేయడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేసారు.

## ఎన్‌బీ పాఠశాలను తనిఖీ చేసిన ఎంఈఓ



**ఉదయగిరి, ఆగష్టు 19, ప్రభాతవార్త** మండల కేంద్రమైన ఉదయగిరి మండల విద్యాశాఖ అధికారి టి. వెంకటేశ్వర్లు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఉదయగిరి ఎన్‌బీ పాఠశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అధికారి విద్యార్థుల అభ్యన పఠన సా మార్ధ్యాలను పరిశీలించారు. తదుపరి డొక్కా సీతమ్మ మధ్యాహ్నం బడి భోజనంను పరిశీలిస్తూ విద్యా ర్థులను తమ సొంత బిడ్డలుగా భావించి ప్రతి రోజు మెనూ ప్రకారం రుచికరంగా భోజనం తయారు చేయాలని నిర్వాహకులకు ప్రధానోపాధ్యాయులకు తెలియజేశారు. పాఠశాల యొక్క అన్ని రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు షేక్ ఖాదర్ భాషా, ఉపాధ్యాయుని షేక్ నసీం అక్తర్ తదితరులు పాల్గొన్నారు.

## వైఎస్‌ఆర్సిపి రాష్ట్ర మహిళా విభాగం జోనల్ ప్రెసిడెంట్‌గా గంగసాని లక్ష్మి



**నెల్లూరు రూరల్, ఆగస్టు 19, ప్రభాతవార్త :** వైఎస్‌ఆర్‌సిపి రాష్ట్ర మహిళా విభాగం జోనల్ ప్రెసిడెంట్‌గా నియమితులైన గంగసాని లక్ష్మికి ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డిఅభినందనలు తెలియజేసారు. నెల్లూరు వైఎస్‌ఆర్సి పి జిల్లా కార్యాలయంలో వైఎస్‌ఆర్సి పి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మరియు నెల్లూరు సిటీ నియోజకవర్గ ఇన్ చార్జ్ ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డిని వైఎస్‌ఆర్సి పి రాష్ట్ర మహిళా విభాగం జోనల్ ప్రెసిడెంట్‌గా నియమితులైన గంగసాని లక్ష్మి మర్యాదపూర్వకంగా కలవగా పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి లక్ష్మిని శాలువాతో సత్కరించి అభినందనలు తెలియజేశారు.

## ఎలక్షన్ కమిషన్ పనితీరు పారదర్శకంగా ఉండాలి



**నెల్లూరు రూరల్, ఆగస్టు 19, ప్రభాతవార్త :** కాంగ్రెస్ ఎలక్షన్ కమిషన్ పనితీరు, ఓట్ల పట్టిక నిష్పక్షికతను ప్రశ్నిస్తూ రాహుల్ గాంధీ చేస్తున్న ఉద్యమానికి సంఘీభావం ప్రకటించినట్లు నెల్లూరు జిల్లా కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ కే సంజయ్ కుమార్ తెలిపారు. రాష్ట్ర కాంగ్రెస్ అధికార ప్రతినిధి కిరణ్ కుమార్ రెడ్డి పిలుపుమేరకు గాంధీ బొమ్మ వద్ద కొవ్వొత్తుల ర్యాలీ ద్వారా నిరసన తెలియజేసినట్లు తెలిపారు. ఓటర్ లిస్టల తారుమారు, ప్రజాస్వామ్య పరిరక్షణ పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించాలని కాంగ్రెస్‌తో సహా ప్రతిపక్షాలు ప్రజా సంఘాలు డిమాండ్ చేస్తున్న చీఫ్ ఎలక్షన్ కమిషనర్ తెలిపిన అసంబద్ధ సమాధానాలు అందర్నీ ఆశ్చర్యానికి గురి చేసాయని తెలిపారు. గతంలో రాజ్యాంగబద్ధంగా స్వయం ప్రతిపత్తితో ఎంతో ఘనత సంపాదించిన ఎలక్షన్ కమిషన్ ఇప్పుడు బిజెపి ప్రభుత్వానికి వత్తాసు పలకడం బాధాకరమని, ఎలక్షన్ కమిషన్ పారదర్శకంగా ప్రజలందరికీ నమ్మకం కలిగించేలా పనిచేయాలని షర్మిల రెడ్డి నాయకత్వంలో కోరుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ నాయకులు అల్లా ఉద్దీన్, సిటీ జనరల్ సెక్రెటరీ అడ్వకేట్ సుధీర్, జిల్లా మైనారిటీ అధ్యక్షుడు రెహమాన్, రూరల్ మల్లికార్జున్ రెడ్డి, సేవాదళ్ సుజాత, ధనుంజయ్, నెహెమ్యా తదితరులు పాల్గొన్నారు.

## పి-4తో పేదల జీవితాల్లో వెలుగులు నింపేందుకు ప్రయత్నిస్తున్న ఆర్‌డిఒ



**ఆత్మకూరు, ఆగస్టు19, ప్రభాతవార్త :** రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఎంతో ప్రతిష్టాత్మ కంగా భావిస్తున్న పి-4 పథకాన్ని ఆత్మకూరు రెవెన్యూ డివిజన్ పరిధిలో దాతలు, పేదల మధ్య అనుసంధాన కర్తగా నూటికి నూరుశాతం ఆచరణ సాధ్యం చేసి పేదల జీవితాల్లో సమూలమైన మార్పులు తెచ్చేందుకు ఆర్డీఒ పావని చేస్తున్న కృషిని డివిజన్ పరిధిలోని ప్రజలు హరిస్తున్నారు. పి-4 పథకంతో పేదరికాన్ని రూపుమాపి అసమానతలు లేని సమాజాన్ని తీసుకువచ్చేందుకు ముఖ్యమంత్రి ఈ పథకాన్ని తలపెట్టారు. ఈ పథకం కింద సమాజంలో ధనవంతులు పేద కుటుంబాలను దత్తత తీసుకొని వారిని సామాజికంగా అభివృద్ధి పదంలో నడిపి వారి జీవితాలను ఆర్థికంగావృద్ధిలోకి తీసుకు వచ్చి పసిడి వెలుగులు నింపడమే ఈ పథకం ప్రధాన ఉద్దేశం. అందులో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్నతాధికారులు ఈ పథకం అమలు బాధ్యతలను అప్పగించింది. పి4పథకాన్ని విజయవంత చేయడం ద్వారా ప్రభుత్వ లక్ష్యాన్ని నెరవేర్చి ముఖ్యమంత్రి తనపై పెట్టుకున్న నమ్మకాన్ని విజయవంతం చేయాలని ముఖ్యమంత్రి సత్ సంకల్పాన్ని నెరవేర్చేందుకు ఉన్నతాధికారుల ఆదేశాలను అమలు చేయడం ద్వారా ఆత్మకూరు డివిజన్ కు పి4అమలులో తగిన గుర్తింపు తీసుకువచ్చేందుకు ఆర్‌డిఒ పావని ప్రణాళికా బద్ధంగాచేస్తున్న కృషి ప్రజలు కొనియాడుతున్నారు. పి4 పథకాన్ని విజయవంతం చేసి డివిజన్‌లో పేదవారికి బంగారు కుటుంబాల కింద ఔత్సాహికులకు దత్తత ఇప్పించి కార్యక్రమాన్ని వేగవంతంగా పూర్తిచేసేందుకు ఆర్‌డిఒ పావనిప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. పేదరికం లేని సమాజాన్ని సఫలం చేసేందుకు ముఖ్యమంత్రి చేస్తున్న కృషి పలప్రధమై ఆత్మకూరు రెవెన్యూ డివిజన్ పరిధిలో పేదప్రజలకు మేలు చేకూరడం హర్షణీయమని అందుకు ఆర్‌డిఒ ప్రత్యేక చొరవ తీసుకొని ముందుకు సాగుతున్నారు. ఏది ఏమైనా ఆర్‌డిఒ పావని ప్రత్యేక శ్రద్ధతో ఈపథకం నూరుశాతం విజయవంతానికి చేస్తున్న కృషి హర్షణీయమని ప్రజలు ప్రశంసిస్తున్నారు.

## విద్యుత్ సరఫరా అంతరాయం

**నెల్లూరు, ఆగష్టు 19, ప్రభాతవార్త -వైద్యం :** 33/11 కేవీ బీవీ నగర్ సబ్ స్టేషన్ పరిధిలోని వినియోగదారులకు మెరుగైన విద్యుత్ సరఫరా కోసం సబ్ స్టేషన్‌లో ఫోర్ ఇన్ వన్ డిసి మాడ్యూల్ యూనిట్ ఏర్పాటు కారణంగా మాగుంట లేఅవుట్, లెక్చరర్స్ కాలనీ, మినీ బైపాస్ రోడ్డు, రవీంద్ర నగర్, వనంతోపు పరిసర ప్రాంతాల్లో ఉదయం 9గంటల నుండి మధ్యాహ్నం 1.30గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుంది. వినియోగదారులు ముందస్తు చర్యలు తీసుకోవాలని, అత్యవసర విభాగం వారు తగిన ఏర్పాట్లు చేసుకోవాలని ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ ఎం. శ్రీధర్ తెలిపారు.

## రక్తదాతలు స్వచ్ఛందంగా ముందుకు రండి




**నెల్లూరు, ఆగష్టు 19, ప్రభాతవార్త -వైద్యం :** కేంద్ర ప్రభుత్వ న్యాయవాది, రెడ్ క్రాస్ నెల్లూరు జిల్లా శాఖ మేనేజింగ్ కమిటీ సభ్యులు, దాసరి రాజేంద్ర ప్రసాద్, రక్తదాతలను ప్రోత్సహిస్తూ తాను రక్తదానం చేశారు. ఇందులో భాగంగా ఆయన మంగళవారం 54వ సారి నెల్లూరు రెడ్ క్రాస్ రక్తనిధి కేంద్రంలో రక్తదానం చేశారు. వాతావరణంలో మార్పులు సంభవించి ప్రజల ఆరోగ్యంపై ప్రభావం చూపినప్పుడు రక్తం కొరత ఏర్పడుతున్న దృష్ట్యా తమ మిత్రులు బంధువులకు రక్తదానం చేయమని ప్రోత్సహిస్తుంటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం రక్తం కొరత ఏర్పడిన దృష్ట్యా రక్త దాతలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కే.పోలయ్య, కృష్ణమూర్తి, చింతగుంట శ్రీనివాసులు, రెడ్ క్రాస్ సెక్రటరీ పి. మస్తానయ్య, రెడ్ క్రాస్ సిబ్బంది పాల్గొని దాసరి రాజేంద్ర ప్రసాద్ సేవలను కొనియాడారు.

## దివ్యాంగులకు శుభవార్త !

## ఉచితంగా మూడు చక్రాల స్కూటీలు



**వలేటివారిపాలెం ఆగష్టు 19, ప్రభాతవార్త :** దివ్యాంగులకు ప్రభుత్వం శుభవార్త ప్రకటించింది. ఉచితంగా మూడు చక్రాల స్కూటీలు మంజూరుకు రంగం సిద్దం చేసింది. సుమారు రూ. 1లక్ష విలువ చేసే మూడు చక్రాల మోటారు వాహనాలను అర్హులైన దివ్యాంగులుకు ఉచితంగా అందచేయడానికి కసరత్తు చేస్తుంది . అర్హులైన దివ్యాంగులు ఏపీడీఎఎస్‌సిఏసీ అనే ఆన్‌లైన్ వెబ్‌సైట్‌నందు అక్టోబరు 31వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించింది. ఇందులో మహిళలకు, ఎస్సీ, ఎస్టీలకు ప్రాదాన్యత ఇచ్చింది. మహిళలకు 50 శాతం, ఎస్సీలకు 16శాతం, ఎస్టీలకు 7శాతం చొప్పున కేటాయించింది. పీజీ చదువుతున్న విద్యార్ధులకు, డిగ్రీ చదివి సెల్ఫ్‌ఎంప్లాయ్‌మెంట్ చేస్తున్న వ్యక్తులకు ప్రాధాన్యత కల్పించనుంది. 45ఏళ్లలోపు వయస్సు, 70 శాతం అంగవైకల్యం కలిగిన స్దానికులు సంబందిత సదరం సర్టిఫికెట్, ఆధార్, కులము, విద్యార్హతల ధృవ పత్రాలతో ఆన్‌లైన్‌లో పొందుపరిచి సదరు హార్డకాపీలను సంబందిత జిల్లాదివ్యాంగుల శాఖ అసిస్టెంట్ డైరక్టర్/జిల్లా మేనేజర్ కార్యాలయంలో అందచేయవలసిందిగా సూచించింది.

## శ్రావణమాసం చివరి సోమవారం సందర్భంగా విశ్వనాధ స్వామికి అభిషేకాలు



**మనుబోలు ఆగష్టు 19 ప్రభాతవార్త :** మనుబోలు చెర్లోపల్లి రైల్వేగేటు సమీపాన వెలసి ఉన్న శ్రీ విశ్వనాధస్వామి వారికి శ్రావణమాసం చివరి సోమవారం సందర్భంగా రాత్రి స్వామి వారికి పంచామృతాభిషేకాలతో సుగంద ద్రవ్యాలతో రుద్రాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శ్రీ సిద్ది విశ్వనాధ కూచిపూడి కళాక్షేత్రం నాట్యచారిని కందల్ల సుస్మిత వారి విద్యార్ధులు నటరాజ స్వామికి కింకిని పూజ నిర్వహించి ప్రత్యేక పూజలలో పాల్గొన్నారు. అర్చకులు శ్రీనివాసులు, స్వామి వారికి పూజలు నిర్వహించి భక్తులందరికి తీర్ద ప్రసాదాలు అందజేశారు. ఈకార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## అనర్హుల పెన్షన్‌ల నిలుపుదల



**నెల్లూరు కలెక్టరేట్, ఆగస్టు 19, ప్రభాతవార్త** దివ్యాంగుల పెన్షన్‌కి సం బంధించి జిల్లాలో 597 హెల్త్ పింఛన్లను దివ్యాంగుల పింఛన్లుగా, వయస్సు ఆధారముగ 1611 వృద్ధాప్య పింఛన్లుగా బద లాయింపు చేయగా 4215 పెన్షన్లను నిలుపుదల చేశారని డిఆర్డీఏ పిడి నాగరాజ కుమారి ఓ ప్రకటనలో తెలియజేశారు. అనర్హులుగా నోటీసు అందుకున్న వారికి అ ప్పీలు దాఖలా చేసే వెసులుబాటు ప్రభు త్వం కల్పించడమైనదని. ఈ సదుపాయం బైయోమెట్రిక్ ద్వారా నోటిస్ తీసుకున్నవారికి మాత్రమే ఉన్నదని. తాము అర్హులమని భావించినట్లయితే, తమ సమీప మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీఓ) లేదా మునిసిపల్ కమిషనర్‌ను సంప్రదించి, తమ అర్జీని సమర్పించవచ్చునని. అర్జీతో పాటు తమ ఆధార్, నోటీస్, గతములో మంజూరు చేసిన సదరం సర్టిఫికట్, ప్రస్తుతము జారీ చేసిన సదరం సర్టిఫికట్ నఖలు సమర్పించవలెను. అధికారులు మీ అర్జీని పెన్షన్ పోర్టల్లో అప్లోడ్ చేసి, తదుపరి చర్యాలి తీసుకోబడుతాయి. మరిన్ని వివరాలకు సమీప గ్రామ/వార్డ్ సచివాలయ అధికారులను సంప్రదించలని నాగరాజ కుమారి ఓ ప్రకటనలో తెలిపారు.

## మున్సిపల్ పాఠశాలకు ఐడిబిఐ బ్యాంకు వితరణ



నెల్లూరు క్రైమ్, ఆగస్టు 19, ప్రభాతవార్త : స్థానిక కర్నాల మెట్టలోని మున్సి పల్ ఉన్న త పాఠశాలకు విఆర్సీ ఐడిబిఐ బ్యాంకు వారు పాఠశాలకు అవస రమైన ఆర్వో ప్లాంట్, కంప్యూటర్, మైక్ సెట్, రెం డు బీరువాలను వితరణగా అందజేశారు. కార్పొరేట్ సామాజిక బాధ్యత కింద మంగళవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన ఒక కార్యక్రమంలో ఆయా వస్తువులను అందజేయడంతో పాటు బ్యాంక్ రీజినల్ ఆఫీసర్ చందన్, బ్రాంచ్ మేనేజర్ బాలాజీలు ఆర్ఓ ప్లాంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా రీజినల్ మేనేజర్ మాట్లాడుతూ తమ బ్యాంకు ద్వారా కార్పొరేట్ సామాజిక బాధ్యత కింద తరచూ పలు సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. విద్యార్థులు బాగా చదువుకుని తమ పాఠశాలకు తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శివరామ ప్రసాద్, ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్

### ఆత్మకూరు నూతన కమిటీ ఎంపిక



**ఆత్మకూరు , ఆగస్టు19,ప్రభాతవార్త :** ఆత్మకూరులోని చెర్లో రమణారెడ్డి భవన్‌లో అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆత్మకూరు ప్రాజెక్ట్ మహాసభ మంగళవారం జరిగింది. ఈ సభకు ముఖ్య అతిథులుగా అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు సుజాతమ్మ , సిఐటియు జిల్లా నాయకులు జి.వి.శివప్రసాద్,ఆత్మకూరు మండల కార్యదర్శి కొండమూరి హజరత్తయ్య, మండల అ ధ్యక్షుడు ఆత్మకూరు నాగయ్యలు హాజరయ్యారు. మాట్లాడుతూ అంగన్‌వాడీ కార్యకర్తలకు కనీస వేతనం 26 వేల రూపాయలు ఇవ్వాలని, ఫేస్ యాప్ రద్దు చేయాలని, ట్యాబ్‌లు ఇవ్వాలని, కూరగాయల బిల్లులు పెంచాలని ప్రభుత్వాన్ని డిమాండ్‌చేశారు. ఈ సమావేశంలో ఆత్మకూరు,ఏఎస్‌పేట, సంగం, చేజర్ల మం డలాల అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లు హాజరయ్యారు. నూతన కమిటీని ఎన్నుకున్నారు. నూతన కమిటీ గౌరవాధ్యక్షులుగా జి.వి.శివప్రసాద్, ప్రాజెక్ట్ కార్యదర్శిగా పి.రాధ, అధ్యక్షురాలిగా కె.రమణమ్మ,కోశాధికారిగా సి.హెచ్.రూతమ్మ, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా విజయభారతి, ఆర్గనైజింగ్ సెక్రటరీగా జమీ ల,ప్ర చార కార్య దర్శిగా నాగరత్నలను, జాయింట్ సెక్రటరీలుగా ఎస్.విజయమ్మ, కె.పద్మ, జి.పద్మావతి, కె.కు సుమ కుమారి, పి.భవాని,ఉపాధ్యక్షులుగా కేశవరత్నమ్మ, విజయలక్ష్మి, వేణుమాధవి,సావిత్రి,కోటేశ్వరమ్మ కమిటీ సభ్యులుగా ఆర్.సుప్రజ, టి.సునీత, హమీదున్నీసా, మస్తానమ్మ, గుల్జార్‌బేగం,వేనుమాధవి, సుశీల, పుష్పకళ, వాణిశ్రీ, ప్రసన్న లను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో నాలుగు మండలాల అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## స్వామివార్లకు వెండి కవచాలు కిరీటాలు అందజేత





**కోవూరు ఆగస్టు 19 ప్రభాత వార్త.**కోవూరులోని రైల్వే రోడ్లో వెలసి ఉన్న శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవస్థానంలో ఉన్న వినాయకుడు సుబ్రహ్మణ్యేశ్వర స్వామి విగ్రహాలకు శ్రావణ మాస మంగళవారం ఏకాదశి పర్వది నాన్ని పురస్కరించుకొని గునుపూడి శ్యాం సుందర్ సుజాత దంపతులు, కుటుంబ సభ్యులు భక్తుల సహకారంతో నాలుగు లక్షల విలువచేసే స్వామి వార్లకు సంబంధించిన వెండి కవచాలు కిరీటాలను మంగళవారం రాత్రి ఆలయ ప్రధాన అర్చకులు నందకిషోర్ స్వామి ఆధ్వర్యంలో ప్రత్యేకంగా పూజలు నిర్వహిం చారు. ఈ సందర్భంగా వెండి వస్తువులను ఆలయ చైర్మన్ వెంకటేశ్వర్లు ఆలయ కోశాధికారి మెంటా రమేష్ బాబు ఆలయ ప్రధాన కార్యదర్శి సింగంశెట్టి రమేష్ బాబులకు అందజేశారు ఈ సందర్భంగా దాతలను సహకరించిన భక్తులను దేవస్థాన పాలకమండలి ప్రత్యే కంగా అభినందించి సత్కరించారు ఈ సందర్భంగా అన్న ప్రసాద్ వితరణ కార్యక్రమాన్ని భారీ స్థాయిలో నిర్వహించారు ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు

## వైభవంగా వరసిద్ధి వినాయక స్వామి ఉత్సవాలు ప్రారంభం



**కోవూరు , ఆగస్టు 19 ప్రభాతవార్త :** కోవూరులోని గాంధీ పార్కు సెంట ర్‌లో వెలసి ఉన్న శ్రీ వరసిద్ధి వినా యక స్వామి దేవస్థానంలో స్వామి వారి నవరాత్రి మహోత్స వాలు మం గళవారం సాంప్రదాయబద్ధంగా భక్తిశ్రద్ధలతో ప్రారంభం అయ్యాయి. ఈ ఉత్స వాలను పురస్కరించుకుని ప్రాత:కాలమునే స్వామివారికి ఆలయ ప్రధాన అర్చకులు పరాంకుశం రాఘవాచార్యులు రుత్వికులు శ్రీకాంతాచార్యులు, ఆధ్వర్యంలో అభిషేక పూజలను సాంప్రదాయబద్ధంగా భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి సహస్ర నామార్చన, పూలంగి సేవ, పల్లకి సేవ కార్యక్రమాలను కన్నులపండువగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఉభయకర్తలుగా పచ్చిపాల దయాకర్‌రెడ్డి జ్ఞాపకార్థం శ్రీనివాసులురెడ్డి కుటుంబ సభ్యులు వ్యవహరించారు.ఆలయ నిర్మాణ కర్తలు దండి సురేష్ దంపతులు, కుటుంబ సభ్యులు భక్తులు ఉన్నారు.






## సర్వీస్ రిక్వెస్ట్ లను నిర్దేశిత సమయంలోపు పూర్తి చేయండి : డిప్యూటీ కమిషనర్ చెన్నుడు



**నెల్లూరు కార్పొరేషన్,ఆగస్టు 19 ,ప్రభాతవార్త:** రెవెన్యూశాఖ వారాంతపు సమీక్షా సమావేశాన్ని కా ర్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ విభాగంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ కమిషనర్ చెన్నుడు మాట్లా డుతూ ఐ.జి.ఆర్.ఎస్ అసెస్మెంట్ లను క్రమం తప్పకుండా పరిశీలించి ఆన్లైన్లోనే పూర్తిచేయాలని సూచిం చారు. అదేవిధంగా అడ్మిన్ కార్యద ర్శుల లాగిన్ లలో ఉన్న సర్వీస్ రిక్వెస్ట్ లను వేగవంతంగా క్లియర్ చేసి ప్రజలకు అందించాల్సి న పౌర సేవలను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. టాక్స్ రివిజన్ సర్వే ద్వారా సేకరించిన డేటా మేరకు నూతన భవనాలను పన్ను పరిధిలోకి తీసుకు రావాలని, అదనపు అంతస్తులకు పన్నులను విధించి, ఖాళీ స్థలం పన్నులు, డ్రైనేజీ పన్నులను వంద శాతం వసూలు చేయాలని సూచించారు. పన్నులు బకాయిలు ఉన్న అన్ని ఖాళీస్థలాలలో యజమానులకు సూచనలు జారీ చేస్తూ నోటీసు బోర్డులు ప్రదర్శించాలని తెలి పారు. బకాయి ఉన్న ప్రతి ఒక్క ఇంటిని సందర్శించి పన్నుల వసూళ్లను ప్రతిరోజు క్రమం తప్పకుండా చేప ట్టాలని తెలిపారు. ఈ సమావేశంలో నగరపాలక సంస్థ రెవెన్యూ అధికారులు శ్రీనివాసులు,సమద్, సూపర్ ఇంటెండెంట్ చినబాబు, రెవెన్యూ ఇన్స్పెక్టర్ లు, వార్డు సచివాలయ అడ్మిన్ కార్యదర్శులు పాల్గొన్నారు.

## కౌలు రైతులు తప్పనిసరిగా సీసీఆర్సీ కార్డులు పొందాలి



**సైదాపురం, ఆగస్టు 19, ప్రభాతవార్త** మండలంలోని కౌలు రైతులు తప్పని సరిగా సీసీఆర్సీ కార్డులు పొందాలని మండల వ్యవసాయ శాఖాధికారిణి హైమావతి తెలిపారు. మండలంలోని పాలూరు, అనంతమ డుగు రైతు సేవ కేం ద్రం పరిధిలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం ఆమె నిర్వ హించారు. ఈ సందర్భంగా రైతులు వేసిన పంటలను పరిశీలించారు. అనంతరం రైతులతో మాట్లాడుతూ భూమి లేని కౌలు రైతులకు సీసీఆర్సీ కార్డులు పొందడం వలన ప్రభుత్వ పథకాలు, రాయితీలు పొందవచ్చని తెలిపారు. అందువలన కౌలు రైతులు తప్పనిసరిగా సీసీఆర్సీ కార్డులు పొందాలని ఆమె సూచించారు. కార్డులు పొందేందుకు స్థానిక వీఆర్వోలను సంప్రదించి రైతు ఆధార్ కార్డు, పాస్‌ఫోర్ట్‌సైజు ఫొటో, కౌలు రాసుకున్న పత్రంతో వీఆర్వో లాగిన్ ద్వారా పొందవచ్చని ఆమె అన్నారు. ఈ సీసీఆర్సీ కార్డుల ద్వారా ప్రభుత్వం అందించే అన్నదాత సుఖీభవ పథకం, రాయితీ ద్వారా వచ్చే పచ్చిరొట్ట విత్తనాలు పొందవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు పచ్చ రాజశేఖర్, రైతులు పాల్గొన్నారు.

## మండలం నుండి ట్రాక్టర్లతో ర్యాలీలో పాల్గొన్న రైతులు



**మనుబోలు ఆగస్టు 19 ప్రభాతవార్త** సర్వేపల్లి నియోజకర్గం శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఏఎంసి చైర్మన్ గాలి రామ కృష్ణారెడ్డి మనుబోలు మండల టిడిపి అధ్యక్షులు పొన్నూరు రామకృష్ణయ్య ఆధ్వర్యంలో మండ లంలోని రైతులు తమ ట్రాక్టర్లతో మంగళవారం నాడు వెంకటాచలంలో జరుగుతున్న అన్నదాత సుఖీభవ ర్యాలీలో పాల్గోనేందుకు బయలు దేరారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతు కూటమి ప్రభుత్వం ద్వారా ఏడాదికి 20 వేలు ఆర్థిక సాయం అందించనున్న నేపధ్యంలో తొలి విడత 7 వేల రూపాయాలు జమ చేసేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడికి,సర్వేపల్లి శాసనసభ్యులకి కూటమి ప్రభుత్వానికి వారు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. తమ ట్రాక్టర్లతో ర్యాలీలో పాల్గొని తమ మద్దతు తెలుపుతున్నామని తెలియజేశారు. ఈకార్యక్రమంలో పచ్చిపాల రామిరెడ్డి ,సాని వెంకటరమణయ్య, శివుడు రాజాగౌడ్, మధునాయుడు, మారంరెడ్డి రమణారెడ్డి, కలికి రమేష్‌రెడ్డి, సుధీర్‌రెడ్డి, వినీల్‌రెడ్డి, రాయపాటి కిరణ్‌కుమార్, పొన్నూరు అశోక్ తదితర మండల నాయకులు పాల్గోన్నారు.

## ఈ ట్యాంక్‌లో నీరు సురక్షితమేనా ?



**కోవూరు , ఆగస్టు 19 ప్రభాతవార్త :** ఒక వైపు మంచినీటి కారణంగా ప్రజలకు అనేక రోగాలు వస్తున్నా యి. ఒకవైపు పంచాయతీ పరిధిలో ఉన్న ట్యాంక్‌లను క్రమం తప్ప కుం డా క్లోరినేషన్ చేయించి ఆపరి స రాలను పరిశుభ్రంగా ఉంచు కోవా లని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు సూచనలు ఇస్తున్నా వాటిని పాటించే నాధుడే కరువయ్యారు. ఫలితంగా ప్రమాదకర పరిస్థితుల్లో పలు ట్యాంక్‌లు దర్శన మిస్తున్నాయి. ఈ దుస్థితి ఎక్కడో మారుమూల ప్రాంతంలో కాదు.. కోవూరు మండల కేంద్రమైన పడుగుపాడు పంచాయతీ చిన్న పడుగుపాడు సచివాలయం-3లో నెలకొంది. ఈ కార్యాలయ ప్రాంగణంలో ఉన్న వాటర్ ట్యాంక్ పరిస్థితి అధ్వానంగా మారింది. ట్యాంక్ పైన చుట్టూ పిచ్చి చెట్లు మొలిచి ఉన్నా దానిపై ఎవరూ దృష్టి సారించిన దాఖలాలు లేవు.ఈ ట్యాంక్ పరిసరాలు కూడా అధ్వానంగా తయారై ఉన్నాయి. వాస్తవంగా ఈ ట్యాంక్‌ను క్రమం తప్పకుండా క్లోరినేషన్ చేస్తున్నారనేది కూడా సమస్యాత్మకంగా మారింది. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు స్పందించి ట్యాంక్ పరిసరాలను పరిశుభ్రం చేసేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## ప్రమాదానికి గురైన చిన్నారికి పుట్టా దంపతుల దాతృత్వం



**బుచ్చి ఆగష్టు 19 ప్రభాతవార్త** బుచ్చిరెడ్డిపాళెం మండలంలోని నాగ మాంబాపురం పంచాయితీలోని విలియమ్స్‌పేట గ్రామంలోని గిరిజనకుటుంబమైన ఏకుల వనజ,శ్రీహరిల కుమార్తె 5 సంత్సరాలు ఇంటి బయట ఆడుకుంటుండగా బైక్ యాక్సి డెంట్ జరిగింది. పాప ఆరోగ్యానికి ఆకుటుంబం ఖర్చు చేయలేనంత దయనీయ పరిస్థితి, రెక్కాడితే డొక్కాడని ఈ నిరుపేద కుటుంబం ధీనస్దితిని చూసి జొన్నవాడ దేవస్దానం మాజీ చైర్మన్ పుట్టా సుబ్రమణ్యంనాయుడు, కౌన్సిలర్ పుట్టా లక్ష్మీకాంతమ్మ పాపను ఆసుపత్రిలో చూపించి ఇంటి ఖర్చులకోసం 10 వేల రూపాయాలు అందజేశారు.ఈకార్యక్రమంలో ముస్లీం మైనార్టీనాయకులు మరియు టిటిపి నాయకులు గ్రామ ప్రజలు వున్నా రు. ఇటువంటి కార్యక్రమాలు పుట్టా దంపతులు అనేకం చేసి వున్నారని గ్రామసమస్యలను కూడా కోవూరు శాసనసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి దృష్టికి తీసుకొని వెళ్లి పరిష్కరిస్తున్నారని వారు హర్షం వ్యక్తం చేశారు.ఈ సందర్బంగా నాయకులు, పాప కుటుంబసభ్యులు పుట్టా దంపతులకు ధన్యవాదాలు తెలిపారు.

## వేడుకగా శ్రీకృష్ణ పరమ్మాత్ముని గ్రామోత్సవం





**బుచ్చి ఆగష్టు 19 ప్రభాతవార్త** బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయితీలోని హౌస్‌తోట పుట్ట వీధిలో ప్రబోద సేవాసమితి ఆధ్వర్యంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలలో భాగంగా నాలురోజు స్వామి వారి ఉరేగింపు వేడుకగా నిర్వహించారు. త్రైత సిద్దాంత భగవద్గీత పారాయణం,అర్చకులు పటించారు. భక్తులు పెద్ద సంఖ్యలో విచ్చేసి స్వామి వారిని దర్శించుకున్నారు.గ్రామోత్స వం హౌసతోట, సుహాసిని నగర్, శ్రీరాం నగర్, ఏరియాల గుండా సాగింది. ఈకార్యక్రమంలో త్రైత సిద్ధాంతం – ప్రబోధ సేవాసమితి ఇందూ జ్ఞాన వేదిక బుచ్చిరెడ్డిపాళెం ఉత్స వ నిర్వాహకులు ఎం సోమశేఖర్,నెల్లూరు కమీటి అద్యక్షులు డి సురమౌళి ,పెంచల నరసయ్య, ఎంసి సుధాకర్‌ఆచారి, రత్నమాచారి, జి ప్రసాద్, జి నరసింహ ప్రసాద్, శేషారత్నమ్మ,శ్రీజ, సిద్దార్ద, డివి ప్రసాద్, శేఖర్, రమాదేవి,కృష్ణ, సుమలత, సుభాష్, పద్మజా, హరి,వేణు, సుమలత,హర్షిత, ప్రదీప్, నిగమశ్రీ,శ్రీదేవి, అన్నపూర్ణ, రఘురామయ్య, వసుందర, కె.వి రత్నం , ప్రవీణ,కీర్తిశ్రీ,విజయమ్మ ,వెంకటేశ్వర్లు, కావ్యశ్రీ, నారాయణమ్మ, సురేంద్ర, కొండమ్మ, అవినాష్‌లు పాల్గోన్నారు

## అన్యాక్రాంతమవుతున్న ప్రభుత్వ భూములను కాపాడండి



**వింజమూరు, ఆగష్టు 19, ప్రభాతవార్త** వింజమూరు మండలం శంఖవరం పంచాయతీ పరిధిలోని శంఖవరం పంచాయతీ పరిధిలోని ప్రభుత్వ భూములు అన్యాక్రాంతమవుతున్నాయని సదరు భూములను రెవెన్యూ అధికారులు కాపాడాలని తెలుగుదేశం పార్టీ నాయకులు భూమిరెడ్డి నరసింహారెడ్డి లేట్ జయన్నలు మంగళవారం శంఖవరం వెంకటాద్రి పాలెం గ్రామస్తులతో కలిసి తహశీల్దార్ కార్యాలయానికి వచ్చి వినతిపత్రాన్ని అందజేశారు. సందర్భంగా వారు మాట్లాడుతూ సుమారు 100 ఎకరాలు ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురైందని పలు సర్వే నెంబర్లలో ఈ ఆక్రమణ జరిగిందని ఎప్పటికైనను ప్రభుత్వ అధికారులు గ్రామ స్థాయిలో విచారణ జరిపి గ్రామంలోని అర్హులైన నిరుపేదలకు పట్టాలను పంపిణీ చేసినట్లయితే పేదవారికి మేలు జరుగుతుందని వారు తెలిపారు. గ్రామంలోని ప్రతి ఒక్కరూ గొర్రెలు, మేకలు, గేదెలను నమ్ముకుని జీవనం సాగిస్తున్నారని తెలిపారు. కావున ప్రభుత్వం వెంటనే అర్హులకు ప్రభుత్వ భూమిని పంపిణీ చేయాలని ఆక్రమణ దారుల నుండి భూములను కాపాడి ఆ భూముల్లో ప్రభుత్వ భూమిగా బోర్డులను ఏర్పాటు చేయాల్సిందిగా వారు కోరారు. ఈ కార్యక్రమంలో బూత్ కన్వీనర్ భక్తవత్సలరెడ్డి, కో కన్వీనర్ ఆనంద్ శోభన్‌బాబు, పిన్నిబోయిన ప్రసాద్, వెంగయ్య మాధవ, వెంకటేశ్వర్లు, మహేంద్ర తదితరులు ఉన్నారు.

## ఎమ్మెల్యేపై హత్యాయత్నానికి ప్రయత్నించిన మాజీ ఎమ్మెల్యేను అరెస్టు చేయాలి



**దగదర్తి, ఆగష్టు 19, ప్రభాతవార్త** ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణారెడ్డిపై హత్యాయత్నానికి ప్రయత్నించిన మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డిని వెంటనే అరెస్టు చేయాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పమిడి రవికుమార్ చౌదరి, టీడీపీ నాయకులు, కార్యకర్తలు డిమాండ్ చేశారు. మంగళవారం దగదర్తి గ్రామంలోని వెలుపోడు రోడ్డు సెంటర్ నందు టీడీపీ నేతలు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పమిడి రవికుమార్ చౌదరి మాట్లాడుతూ ఎమ్మెల్యే కృష్ణారెడ్డి హత్యాయత్నానికి రెక్కీ నిర్వహించారని తెలిపారు. మారణాయుధాలతో దాడి చేయాలని, డ్రోన్ల సహాయంతో ఎమ్మెల్యేని కనిపెట్టాలని కుట్ర పన్నడం జరిగిందని తెలిపారు. ఎమ్మెల్యే కార్యక్రమం మారిపోవడం, క్వారీకి వెళ్లకపోయే సరికి ప్రమాదం తప్పిందని, అక్కడ ఉన్న సిబ్బందిపై దాడికి దిగడం జరిగిందని తెలిపారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మాజీ ఎమ్మెల్యే అనుచర్ల చేతిలోని మారణాయుధాలను, వారి అనుచరులు కొంత మందిని అదుపులోకి తీసుకోవడం జరిగిందని తెలిపారు. నిందితులు కొంత మంది మాత్రమే దొరకడం జరిగిందని, మరి కొంత మంది పారిపోవడం జరిగిందని తెలిపారు. ఈ ఘటన వెనుక ఉన్న మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్‌రెడ్డిని, అలాగే ఈ ఘటనతో ప్రమేయ ఉన్న వారి అనుచరుల మొత్తాన్ని అరెస్టు చేయాలన్నారు. ప్రశాంతమైన కావలిని హత్యా రాజకీయాలకు నిలయం చేస్తారా అంటూ రెక్కీ ఘటనపై టీడీపీ నేతలు భగ్గుమన్నారు. మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి హింసాత్మక, విధ్వంసక ఆలోచనలు ప్రజాస్వామ్య మనుగడకు ప్రమాదకరమంటూ ఆయనను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.

## మెడికవర్ క్యాన్సర్ ఇనిస్టిట్యూట్‌లో విజయవంతమైన స్టెమ్ సెల్ మార్పిడి



**నెల్లూరు, ఆగష్టు 19, ప్రభాతవార్త** –వైద్యం నెల్లూరులోని మెడికవర్ క్యాన్సర్ ఇనిస్టిట్యూట్ ఒక గొప్ప విజయాన్ని సాధించింది. తిరుపతికి చెందిన 57 ఏళ్ల వ్యక్తికి మల్టిపుల్ మైలోమా అనే రక్త క్యాన్సర్ కోసం ఆటోలో గస్ స్టెమ్ సెల్ ట్రాన్స్ ప్లాంట్ ట్రాన్స్ ప్లాంట్(స్వంత మూల కణాల మార్పిడి) అనే చికిత్సను విజయవంతంగా పూర్తి చేసింది. ఈ చికిత్సను డాక్టర్‌జి.రంగ రామన్ గంట నేతృత్వంలోని బృందం నిర్వహించింది. ఈ రోగికి ఈ ఖరీదైన చికిత్స, ప్రభుత్వ ఎన్టీఆర్ వైద్య సేవ పథకం కింద ఉచితంగా లభించింది. మల్టీపుల్ మైలోమా అనేది ఎముక మజ్జ(బోన్ మ్యారో0 లో ఉండే ప్లాస్మా కణాలను ప్రభావితం చేసి ఒక రకమైన రక్త క్యాన్సర్. ఆటోలో గస్ స్టెమ్ సెల్ ట్రాన్స్ ప్లాంట్ అనేది ఈ క్యాన్సర్‌కు ఒక అధునాతన చికిత్స. ఈ పద్ధతిలో ముందుగా రోగి నుంచే ఆరోగ్యవంతమైన మూల కణాలను(స్టెమ్ సెల్స్) సేకరించి భద్రపరుస్తారు. ఆ తర్వాత, క్యాన్సర్ కణాలను నాశనం చేయడానికి రోగికి ఎక్కువ మోతాదులో కిమోథెరపి ఇస్తారు. తరువాత, భద్రపరిచిన మూల కరనాలనుతిరిగి రోగి శరీరంలోకి ఎక్కిస్తారు. ఈ కొత్త మూల కణాలు కొత్త, ఆరోగ్యవంతమైన రక్త కణాలను ఉత్పత్తి చేస్తాయి. ఈ చిక్సిత రోగికి దీర్ఘకాలికంగా ఉపశమనం అందించడంలో సహాయపడుతుంది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ పథకం కింద ఈ చికిత్సను ఉచితంగా చేశారు. ఈ పథకం పేదలకు ఖరీదైన, అధునాతన వైద్య చికిత్సలను అందిస్తుంది. బోన్ మ్యారో ట్రాన్స్‌ప్లాంట్, క్యాన్సర్ చికిత్స, కీమోథెరపి వంటి ఖర్చుతో కూడుకున్న వైద్య సేవలను ఈ పథకం ద్వారా ఉచితంగా పొందవచ్చు. దీని వల్ల ఆర్థిక భారం లేకుండా మల్టిపుల్ మైలోమా రోగులు మెరుగైన వైద్యం పొందుతున్నారు. ఈ రోగికి హై ఇంటెన్సిటీ కిమోథెరపి, స్టెమ్ సెల్ ఇన్ఫ్యూషన్ చికిత్సలు పూర్తయ్యాయి. చికిత్స తర్వాత ఏర్పడిన బలహీనత వంటి సమస్యలను వైద్య బృందం సమర్ధవంతంగా నిర్వహించింది. రోగి ఆరోగ్యం వేగంగా మెరుగుపడి, చికిత్స ప్రారంభించిన 14 రోజులకే కోలుకొని ఆరోగ్యకరంగా డిశ్చార్జ్ అయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ జి.రంగ రామన్ గంట మాట్లాడుతూ ఆటోలోగస్ స్టెమ్ సెల్ రటాన్స్‌ప్లాంట్ అనేది మల్టిపుల్ మైలోమా లాంటి తీవ్రమైన రక్త క్యాన్సర్లకు అత్యంత ప్రభావవంతమైన చికిత్స. ఈ విజయం నెల్లూరు, చుట్టు పక్కల ప్రాంతాల రోగులకు కొత్త ఆశను ఇచ్చిందని అన్నారు. మెడికవర్ క్యాన్సర్ ఇనిస్టిట్యూట్ నెల్లూరులో క్యాన్సర్ చికిత్సలో అగ్రగామిగా నిలుస్తూఎన్టీఆర్ వైద్య సేవ పథకం ద్వారా పేదలకు కూడా అత్యాధునిక వైద్య సేవలను అందిస్తోంది. ఈ విజయం క్యాన్సర్‌తో పాటు పోరాడుతున్న ఎంతో మందికి కొత్త ఆశను, ధైర్యాన్ని ఇస్తుంది. నెల్లూరు పరిసర ప్రాంత ప్రజలకు ఎన్టీఆర్ వైద్య సేవ ద్వారా మరింత కార్పొరేట్ స్థాయి వైద్యం మన మెడికవర్ క్యాన్సర్ ఇనిస్టిట్యూట్ నెల్లూరులో అందించబడుతుందని సెంటర్ హెడ్ జి.రంజిత్ రెడ్డి, క్యాన్సర్ ఇనిస్టిట్యూట్ హెడ్ పవన్ వివరించారు.